1/70 చట్టానికి వ్యతిరేకంగా గిరిజనేతరులు అక్రమ కట్టడాలు

విశాలాంధ్ర-డుంబ్రిగూడ : 1/70 చట్టానికి వ్యతిరేకంగా గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని సముద్ర అధికారులు స్పందించి అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేయాలని మండల గిరిజనులు కోరుతున్నారు. మండలంలోని అరుకు, కురిడి, కించుమండ పంచాయతీ కేంద్రాల్లో జోరుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులు అక్రమంగా శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. చట్టానికి వ్యతిరేకంగా శాశ్వత గృహాలతోపాటు భవంతులను నిర్మిస్తున్నారు. ఆయా పంచాయతీ కేంద్రాల్లో పరదాల చాటున అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారు. అక్రమ నిర్మాణాలపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన సంబంధిత రెవెన్యూ యంత్రాంగం స్పందించి గిరిజనేతరుల అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపి నిలుపుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈవిషయంపై స్థానిక రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆర్ఐ రాజును స్థానిక విశాలాంధ్ర వివరణ కోరగా 1/70 చట్టానికి వ్యతిరేకంగా గిరిజనేతరులు నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చదివి చేపడతామని ఆయన చెప్పారు. ఇటీవలే కురిడిలో జరుతుతున్న అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయడం జరిగిందని, కించుమండ, అరుకులో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై విచారణ చేపట్టి గిరిజనేతరులపై శాఖ పరమైన చర్యలు తీసుకంటామని ఆర్ఐ తెలిపారు.

అగ్ని ప్రమాద భాధిత కుటుంబానికి కుట్టు మిషన్ వితరణ

విశాలాంధ్ర-దేవీపట్నం : ఇటీవల దేవీపట్నం మండలం ఎమ్. రావి లంక గ్రామంలో అగ్ని ప్రమాదానికి గురై రెండు కుటుంబాలు సర్వం కోల్పోయి పూర్తిగా నిరాశ్రయులు అయ్యారు. ఈ విషయం తెల్సుకున్న ఇందుకూరు పేట గ్రామానికి చెందిన అరిసె పెదకాపు అనే దైవ జనులు కొన్ని నిత్యవసర వస్తువులు అందించి వారి జీవనోపాధికి అవసరమైన ఒక కుట్టు మిషన్ అందించడం జరిగింది. కుటుంబ పోషణ కు అవసరమైన కుట్టు మిషన్ ఇవ్వటం పట్ల కృతజ్ఞతలు తెలియ జేశారు.

బీసీలకు చట్ట సభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి

విశాలాంధ్ర-అడ్డతీగల : బిసిలకు 50శాతం చట్టసభల్లో రిజర్వేషనులు కల్పించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ చొల్లంగి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. బుధవారం నాడు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బిసిలకు రక్షణ చట్టం ప్రవేట్ జోన్ లలో రిజర్వేషన్ లు కల్పించాలని స్థానిక ఎన్నికలలో 52 రిజర్వేషన్‌లు కల్పించాలని వీటి సాధనకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం కృషి చేయాలని జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కమిటీ లు నిర్మాణం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వంగా రాము కట్టా ప్రసాద్ చొల్లంగి గోపినాధ్ చొల్లంగి రాంబాబు గొర్లె నారాయణ మూర్తి కేతా బాలాజీ డి. నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం... భవన నిర్మాణాలు అసంపూర్ణం

విశాలాంధ్ర-చింతపల్లి : నిధులు దుర్వినియోగమై, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహ భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్ర కశ్మీర్ లంబసింగి లో బాలికల ఆశ్రమ పాఠశాలలో పూర్తిస్థాయిలో వసతి గృహ భవనాలు లేక, ఆశ్రమ వసతి గృహ విద్యార్థినిలు గడచిన దశాబ్ద కాలంగా చాలీచాలని భవనాలలో అటు విద్య, ఇటు వసతి సౌకర్యాలు పొందుతున్నారు. వందలాది మంది విద్యార్థినిలు విద్యను అభ్యసిస్తున్న ఆశ్రమ వసతి గృహాలలో పూర్తిస్థాయిలో భవనాలు నిర్మించాల్సి ఉన్నప్పటికీ, ఆంధ్ర కశ్మీర్ లంబసింగి గిరిజన సంక్షేమ బాలికల వసతిగృహంలోనే గాక, లోతుగెడ్డ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ వసతి గృహం లోను, అదేవిధంగా మన్యంలోనే పలు ఆశ్రమ వసతి గృహాలలో పాఠశాల భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు స్థానిక పర్యాటక అభివృద్ధిపై పెట్టే శ్రద్ధ అదే ప్రాంతంలో ఉన్న ఆశ్రమ వసతి గృహ అసంపూర్తి భవన నిర్మాణాలపై పెట్టకపోవడంపై ఈ ప్రాంత ప్రజలు పెదవి విరుస్తున్నారు. నాడు తెలుగుదేశం ప్రభుత్వంలోనే మంజూరైన ఈ భవనాలు గత వైకాపా ప్రభుత్వంలో నిరాదరణకు గురయ్యాయని, ఈ ప్రభుత్వంలోనైనా అసంపూర్తిగా ఉన్న ఆశ్రమ వసతి గృహ భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలని ఈ ప్రాంత ప్రజలు ఆశ్రమ వసతి గృహ ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

చెక్ పోస్ట్ వద్ద అటవీ శాఖ అక్రమ వసూళ్లు

విశాలాంధ్ర-రంపచోడవరం : అటవీ ఉత్పత్తులు ఇతరత్ర అక్రమ రవాణా సాగిస్తే అక్రమ వసూళు పరిపాటే. సామాన్యులు స్థానికులను సైతం వదిలి పెట్టక పోవటం స్థానికుల ఆగ్రహం కు గురవుతున్న మారేడుమిల్లి అటవీ శాఖ చెక్ పోస్ట్. మండల కేంద్రమైన మారేడుమిల్లి లోని కస్తూరి బా గాంధీ పాఠశాలకు సమీపంలో అటవీ శాఖ ఏర్పాటు చేసిన పాపికొండలు నేషనల్ పార్క్ పర్యాటక చెక్ పోస్ట్ వల్ల స్థానికులు పర్యాటకులు వాహనదారులు స్థానికులను సైతం సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తు అక్రమ వసూళ్లకు పాల్పడటంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు స్థానికులు గ్రామంలో రాకపోకలు సాగించే వారిని సైతం వదిలి పెట్టడం లేదని పలువురు వాపోతున్నారు. మారేడుమిల్లి, వై రామవరం ఎగువ ప్రాంతాలకు చెందిన అనేక వాహనాలు మారేడుమిల్లి మీదుగా రంపచోడవరం, రాజమహేంద్రవరం వెళ్లే వాహనాలు అనేకం. మారేడుమిల్లి, వై రామవరం వెళ్లే వాహనాలకు ఫీజులు వసూలు చేయడం తగదు. లోకల్ వాహనాలకు మీనహాయింపు చేస్తున్న దందా పై సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. ఈ చెక్ పోస్ట్ ఏర్పాటు ప్రభుత్వ ప్రయోజనాలక, లేక ప్రజా ప్రయోజనాలక అని స్థానిక ప్రజలకు అనేక సందేహాలు ఉత్పన్న మౌతున్నాయి . దీనిపై అటవీ శాఖ అధికారులు ప్రజల అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఎంతయిన ఉంది స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే గతం లో జరిగిన మెడికల్ విద్యార్థులు పర్యాటకం కు వచ్చి మృతి చెందిన సంఘటనతో మారేడుమిల్లి వచ్చే పర్యాటకులు ఘననీయంగా తగ్గిపోయి, వ్యాపారాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ వ్యవహారం పర్యాటక ప్రాంతం పరువు మరింత పోయే పరిస్థితులు దాపురిస్తాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొండ గోకిరి, కినపర్తి, రత్నంపేటలో రెవిన్యూ సదస్సులు

విశాలాంధ్ర-కొయ్యూరు : కొండ గోపిరి, కినపర్తి, రత్నంపేట పంచాయతీలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు డిటి కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ ఈ మూడు సదస్సులలో 93 దరఖాస్తులు స్వీకరించామని వాటిలో మ్యూటిషన్ -19, కోర్టు కేసులు-3, ఎఫ్ లైన్-2, ల్యాండ్ డిస్ప్యూటీ-6, కొత్త అసైన్మెంట్ డిపట్టా-18, వెబ్ లాండ్, సర్వేనెంబర్ యాడింగ్-19, ఆర్ఓఎఫ్ఆర్ అప్లికేషన్లు-26 వచ్చినట్లు తెలిపారు. ఈ దరఖాస్తులన్నింటిని క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి 45 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ కుమారస్వామి, ఆర్డిటి అప్పన్న సిబ్బంది మరియు మూడు పంచాయతీల గ్రామస్తులు పాల్గొన్నారు.

పెసా ఎన్నికల్లో గిరిజనేతరులకు ప్రాధాన్యత ఇచ్చినచోట్ల రీపోలింగ్ నిర్వహించాలి

- ఎంపీడీవో ఎస్‌కెవి ప్రసాద్‌కు ఫిర్యాదు
- సమాచార హక్కు చట్టం కోఆర్డినేటర్ 'అర్జున్ రెడ్డి'

విశాలాంధ్ర-కొయ్యూరు : ఇటీవల జరిగిన పెసా ఎన్నికల్లో గిరిజనేతర్లకు ప్రాధాన్యం కల్పించిన చోట్ల రీపోలింగ్ నిర్వహించాలని ఎంపీడీవో ఎస్ కె వి ప్రసాద్ కు ఫిర్యాదు చేయడం జరిగిందని సామాజిక సేవకుడు, జిల్లా సమాచార హక్కు చట్టం కోఆర్డినేటర్ అర్జున్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ మండలంలో గత శుక్రవారం మూడవ తేదీన జరిగిన ఎన్నికల్లో కొమ్మిక పంచాయతీ, కొప్పుకొండ, కొత్త తుమ్మలమంద, పాత తుమ్మల బంధ, రేవళ్లు, ఊర్లోది, తాళ్లపాలెం ఈ ఏడు చోట్ల పెసా చట్టం ఎన్నికలు రీపోలింగ్ నిర్వహించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెసాచట్టం ఎన్నికలు కోరం లేకుండా తూతూ మంత్రంగా జరిగాయని ప్రజలకు పెసా ఎన్నికలు జరుగుతున్నాయని సరైన సమాచారం కూడా ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహించడం జరిగిందని అన్నారు. గిరిజన ప్రాంతంలో గిరిజనుల చట్టాలకు వ్యతిరేకంగా చట్టాలను హరిస్తూ ప్రజలకు సమాచారం అందించకుండా ఎన్నికలు అధికారులు రాజకీయ నాయకులు ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించాలని ఆరోపించారు పీసా ఎన్నికల అధికారులు ఎన్నికల నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఎన్నికల అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు కొప్పుకొండ పరిధిలో ఏడికి గ్రామాలకు నిర్వహించాలని ఆయన అన్నారు .ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మాతే గణేష్ కొమ్మిక పంచాయతీ యూనిట్ ఇన్చార్జ్ గాలి చిన్నారావు కొప్పుదేవుడు పాల్గొన్నారు.

శీతల ప్రాంత విద్యార్థుల సౌకార్యార్థం కార్పెట్ల పంపిణీ

విశాలాంధ్ర-రంపచోడవరం : తూర్పు ఏజన్సీ మారుమూల మండలాలైన మారేడుమిల్లి, వై.రామవరంలలో విద్యార్థులు చలికాలంలో క్రింద కూర్చున్నప్పుడు చలి వేయకుండా కార్పెట్లు ఎక్కడికి అక్కడ సరఫరా చేయడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో వై.రామవరం మండలం, మారేడుమిల్లి మండలాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో, జీపిఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామ సచివాలయాలకు సంబంధించిన వెల్ఫేర్ అసిస్టెంట్లకు, మండల విద్యాశాఖ అధికారులకు, ఎంపీడీవోలకు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్. కల్పశ్రీ కార్పెట్స్ అందజేశారు. ఈసందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ మారేడుమిల్లి మండలం, వై.రామారావు మండలం మారుమూల ప్రాంతాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఈ చలి కాలంలో బాల బాలికలు స్కూల్స్ కు వచ్చినప్పుడు కింద కూర్చున్నప్పుడు చలికి తట్టుకునే విధంగా ప్రాథమిక పాఠశాలలను గుర్తించి కార్పెట్స్ రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ ఆధ్వర్యంలో ఐటీడీఏ, ఐడిఎఫ్సి తుని బ్యాంకు ఆధ్వర్యంలో ప్రస్తుతం 80 మీటర్లు పొడవున్న ఆరు బండిల్స్ సంబంధిత అధికారులకు అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ వైరామవరం మండలం, మారేడుమిల్లి మండలంలోని మారు మూల ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పాఠశాలలకు వచ్చినప్పుడు చలి చాలా ఎక్కువ ఉంటుందని స్వయంగా నేను పరిశీలించడం జరిగిందని అదేవిధంగా పాఠశాలలో బాల బాలికలు పాఠశాలలలో కింద కూర్చున్నప్పుడు చలి వేయకుండా కార్పెట్స్ ఏర్పాటు కొరకు ప్రాజెక్ట్ అధికారి వారి దృష్టికి తీసుకురావడం జరిగిందని వెంటనే ప్రాజెక్ట్ అధికారి వారు కార్పెట్ ఏర్పాటుకు వెంటనే స్పందించి ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్య శాఖ అధికారులు ముత్యాలరావు, వై.వెంకట రమణ, ఎంపీడీవో కె.బాపన్న దొర, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ ఇంజనీర్ నాగరాజు, ఐడిఎఫ్సి ఫస్ట్ తుని బ్యాంక్ మేనేజర్ ఎస్సీ ఎస్.ఎన్.మూర్తి, సహాయకులు ఎ. కాజా, అఖిల్ రెడ్డి, వైరామవరం, మారేడుమిల్లి మండలాలకు సంబంధించిన గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రెండు కేజీల లిక్విడ్ గంజాయి పట్టివేత

విశాలాంధ్ర-మోతుగూడెం : అల్లూరి సీతారామరాజు జిల్లా, ఎస్పీ అమిత్ బర్దర్ ఐపీఎస్, చింతూరు ఏఎస్పి పంకజ్ కుమార్ మీనా ఐపిఎస్, చింతూరు సిఐ తెల్లం దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం డొంకరాయి ఎస్సై శివకుమార్ తన సిబ్బందితో డొంకరాయి గ్రామ శివారులో ఉన్న శ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయం వద్ద హైదరాబాద్ కు చెందిన రాహుల్ చంద్రకాప్రి అనే వ్యక్తి అనుమానాస్పదంగా ఉండడంతో అతన్ని పట్టుకొని మధ్యవర్తులు మరియు లక్కవరం ఎఫ్ఆర్ఓ వెంకట నానాజీ సమక్షంలో పరిశీలించగా అతని వద్ద 5లక్షల రూపాయలు విలువచేసే 2 కేజీల లిక్విడ్ గంజాయి ఉన్నట్లు గుర్తించి రాహుల్ చంద్ర కాప్రి ని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించారు.

పత్రికా విలేఖర్లు కావలెను

విశాలాంధ్ర తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఈక్రింది మండలాలు **మారేడుమిల్లి, రంపచోడవరం,** ప్రాంతాలకు అనుభవం గల విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెం.
7989138129, 7386603589

ప్రధానమంత్రి బహిరంగ సభకు తరలివెళ్ళిన టిడిపి, బిజెపి, జనసేన నేతలు

విశాలాంధ్ర-సీతానగరం : విశాఖపట్నంలో పలు అభివృద్ధికార్యక్రమాల శంకుస్థాపన కోసం, బహిరంగసభకు దేశప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,ఎన్డీఏ పార్టీలకు చెందిన కీలక నేతలు, మంత్రులు పెద్దఎత్తున బుధవారంనాడు విచ్చేసిన సందర్భంగా ఎంఎల్ఏ విజయ్ చంద్ర ఆదేశాలు, సూచనలు మేరకు మండల టీడీపీ నేతలు బస్సులలో ప్రైవేటు వాహనాలలో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వెలుగు రెవిన్యూ అధికారులు బస్సులకు ఇన్చార్జులుగా వ్యవహరించారు. వెళ్లిన వారందరికీ భోజన సౌకర్యాన్ని త్రాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. వెళ్లిన వారిలో సాల హరగోపాల్, దామినేని భాను ప్రసాద్,పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాల నాయుడు, జొన్నాడతేరేజమ్మ గరికయ్య, కంకణాలపల్లి అరవింద్ కుమార్, సబ్బాన శ్రీనివాసరావు, బుడితి శ్రీనివాసరావు, ఇజ్జాడ రాంబాబు, సత్తెన్నా, తెంటు వెంకట అప్పలనాయుడు, ఉడమల సూర్యనారాయణ, ఏగిరెడ్డి భాస్కరరావు, రామక్రిష్ణనాయుడు, రెడ్డి సింహాచలంనాయుడు, సోమిరెడ్డి రమేష్, నాగభూషణరావు, శ్రీనివాసరావు, వంజరాపు గుంపస్వామి నాయుడు, శ్రీరాములనాయుడు, మూడడ్ల వెంకట నాయుడు, వాకాడ పారినాయుడు, గాజాపు తాతబాబు, గొట్టాపు అప్పారావు, తెంటు రామారావు, తేలు చంద్రశేఖర్, అన్నం నాయుడు మజ్జి దత్తు,కొల్లి సురేష్, బొన్నాద సత్యనారాయణ, సబ్బాన జగన్నాథం, మర్రాపు శంకరరావు, నీరస చంద్రశేఖరరావు జ్యోతి, కళ్యాణ బలరాం, బుడితి గోపాలకృష్ణ, పరశురాము నాయుడు, పూడి శ్రీరాములునాయుడు, పరిసినాయుడు,యాళ్ల రామినాయుడు, కండ్యాన రవీంద్రనాయుడు, బలగ ధనంజయనాయుడు, బూరాడ చిరంజీవి, బొమ్మినాయునిలక్ష్మణరావు, బోను శ్రీనివాసరావు,,మీసాల వెంకటరమణ, సూరిబాబు,ఎన్ సతీష్,సాయి, జక్కుపకీరునాయుడు,మర్రాపు సత్యనారాయణ, తాన్న సత్యనారాయణ బొంగు సురేష్,మర్రాపు యోగేశ్వరరావు, గుప్తాదిత్య పట్నాయక్, కొల్ల అప్పలనాయుడు, సుమన్, సిరిసాలశ్యాం, ఇనమల జగన్నాథం, దండి సత్యం నాయుడు బిజెపి అధ్యక్షులు బాలు యాదవ్,జనసేన అధ్యక్షులు పాటి శ్రీను నాయకులు, సైనికులు ఉన్నారు.

జిల్లా అభివృద్ధికి సమన్వయంతో సమష్టి కృషి చేయాలి

విశాలాంధ్ర-పార్వతీపురం/బెలగాం : జిల్లా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేవిధంగా అధికారులు సమన్వయంతో సమష్టి కృషి చేయాలని అరకు పార్లమెంట్ సభ్యురాలు తనూజా రాణి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధికి చేపడుతున్న చర్యలు, వివిధ శాఖల ప్రగతిపై అధికారులతో జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిషా కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న అభివృద్ధి పనులను సమన్వయంతో సమష్టిగా పనిచేసి లక్ష్యాలను సాధించేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో మంచి ఆరోగ్యం, నాణ్యమైన విద్య అందేవిధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గర్భిణీ మహిళలు, చిన్నారులలో ఎనీమియా లోపాన్ని అధిగమించేం దుకు గ్రామాల్లో ఏఎన్ఎం, ఆశ వర్కర్లను పంపించి రక్తహీనతతో బాధపడుతున్న వారిని దత్తత తీసుకొని పర్యవేక్షిస్తున్నామని, ప్రతి 15 రోజులకు పౌష్టికాహారం అందించడం జరుగుతున్నదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా,. ఎస్. భాస్కరరావు వివరించారు. మెరుగైన చర్యలు చేపట్టడం వలన రక్త హీనత బాధితుల సంఖ్య తగ్గుముఖం పడుతుందని, భవిష్యత్తులో సికిల్ సెల్ కేసులు వచ్చే అవకాశం ఉండదని తెలిపారు. (ప్రధాన్ మంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్) కుసుం పథకంలో భాగంగా సౌర విద్యుత్, వ్యవసాయం యొక్క ప్రయోజనాలు అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన క్రింద రూఫ్ సోలార్ విద్యుత్ ప్రజలకు మరింత చేరేలా కృషిచేయాలని, తద్వారా ప్రజలకు విద్యుత్ భారం తగ్గుతుందని విద్యుత్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎంపి ల్యాండ్ నిధులతో రోడ్లు డ్రైనేజీ కమ్యూనిటీ భవనాల నిర్మాణాల పనుల వివరాలపై ఆరా తీశారు. అవసరమైన చోట అంగన్వాడీ కేంద్రం నిర్వహణ భవన నిర్మాణాలకు, పాఠశాలలో మరుగుదొడ్లు మారామత్తులు ఆధునీకరణ పనులకు నిధులు వంజూంగకం ప్రతిపాదనలు అందించాలని ఇంజరేరింగ్ అధికారులను కోరారు. జిల్లాలో ప్రధానమంత్రి అర్బన్ ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణాలను లక్ష్యంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ శాఖల వారిగా పురోగతిని, అభివృద్ధి పనుల ప్రగతిని ఎంపికి తెలియజేయడంతో సంతృప్తిని వ్యక్తంచేశారు. అనంతరం జిల్లా రహదారుల అభివృద్ధిలో భాగంగా మూడు రాష్ట్ర హైవే రహదారులను జాతీయ రహదారులు గా మార్పు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభిత, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి బి.వి సత్యన్నారాయణ, జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలత, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు కె. రామచంద్ర రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె. రాబర్ట్ పాల్, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్. వంశీ కృష్ణ, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజనీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు వై. సత్యంనాయుడు, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎం.వి నగేష్ బాబు, జిల్లా విద్యా అధికారి డా. ఎన్. తిరుపతి నాయుడు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి గయాజుద్దీన్, జిల్లా వెనుకబడిన తరగతుల సాధికారిత అధికారి కృష్ణ, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎన్. విజయ్ స్వరూప్, జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి వీర్రాజు, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి కరుణాకర్, జిల్లా క్రీడా సాధికారిత అధికారి ఎస్. వెంకటేశ్వరరావు, జిల్లా సహకార శాఖ అధికారి పి. శ్రీరామమూర్తి, జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి శ్యామల, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి కనకదుర్గా, పోస్టల్ సహాయ పర్యవేక్షకులు మురళీ, జిల్లా పంచాయతీ అధికారి టి. కొండలరావు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజమండ్రికి ప్రత్యేక బస్సు సర్వీస్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రయాణికులు సౌకర్యార్థం పార్వతీపురం నుంచి రాజమండ్రి కి ప్రత్యేక బస్సు సర్వీసు నడపడం జరుగుతుందని డిపో మేనేజర్ ఈ ఎస్ కె దుర్గ తెలిపారు. ఈ బస్సు సర్వీసు 17 18 19 తేదీలలో నడపడం జరుగుతుందని మధ్యాహ్నం గం.02.00ల సమయంలో పార్వతీపురం బస్సు స్టేషన్ నుండి ఒక అల్ట్రా డీలక్స్ బస్సు రాజమండ్రికి నడపడం జరుగుతుందన్నారు.అదే బస్సు రాజమండ్రి బస్ స్టేషన్ నుంచి ఉదయం 6:30 నిమిషములకు బయలుదేరుతుందన్నారు. ప్రయాణికులు ఓపిఆర్ఎస్ నంబర్ లతో ఏపీఎస్ఆర్టీసీ సైట్ ద్వారా రిజర్వేషన్ చేసుకొనే సదుపాయం కల్పించడం జరిగిందన్నారు.

గుంతలను కప్పిన పోలీసులు

విశాలాంధ్ర-సీతానగరం : రోడ్డు భద్రతలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీతానగరం ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జిపై ఉన్నటువంటి గుంతలను కాంక్రీట్తో నింపి గోతులను ఎస్ఐ రాజేష్, పోలీస్ సిబ్బంది దగ్గరుండి కప్పించారు.రహదారి భద్రత నియమాలపై జోగంపేటలో ఉన్న స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సులో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ను ధరించాలని, రోడ్డును దాటేటప్పుడు, రోడ్డుపై నడిచేటప్పుడు రహదారి భద్రతా నియమాలను పాటించాలని కోరారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరముల పట్ల అవగాహన కలిగి ఉండి తమ తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులందరికీ కూడా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరముల పట్ల అవగాహన కల్పించాలని ఎస్ఐ రాజేష్ తెలిపారు.

బాలికల వికాసానికి పటిష్ట చర్యలు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : బాల్య వివాహాలు, బాల్యంలో గర్భధారణ వంటి సంఘటనలు జరగకుండా అరికట్టి బాలికల వికాస దిశగా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, గ్రామ వార్డు సచివాలయం, పోలీసు వంటి శాఖలతో కిషోరీ వికాసం కార్యక్రమంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సం.11 నుంచి18 వయస్సు లోపు పాఠశాల కళాశాల విద్యార్థులు, సం.11 నుంచి18 వయస్సు లోపు బడి బయట విద్యార్థులను గ్రూపులుగా విభజించి పిల్లల సంరక్షణ, పోషణ అవసరాలు, కౌమార బాలికల సమస్యలు గుర్తించి వికాసానికి అవసరమైన పటిష్ట చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే బాల్య వివాహాలు అరికట్టడం, విద్య ఉద్యోగం కల్పనకు, పౌష్టికాహారం అందించడం, ఆత్మ సంరక్షణ, లైంగిక వేధింపుల నుండి రక్షణ వంటి అంశాలపై సమన్వయంతో నిర్మూలకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పథక సంచాలకులు టి. కనకదుర్గా, సెట్ ఫీస్ బుక్ కార్యనిర్వహణాధికారి బి. రామ్ గోపాల్, జిల్లా విద్యా శాఖ అధికారి డా. ఎన్. తిరుపతినాయుడు, స్వచ్ఛంద సంస్థలు అప్ హెరాల్డ్, నీడ్, ఐఆర్ పిడబ్ల్యు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం/బెలగాం : జిల్లాలో ప్రధాన మంత్రి జన్మాన్ పివిటిజి ఇళ్ల నిర్మాణం పనులు త్వరితగతిన చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు ప్రధాన మంత్రి జన్మాన్ పివిటిజి ఇళ్ల నిర్మాణం పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి స్థలం పొందిన ప్రతీ ఒక్కరు ఇంటి నిర్మాణం పనులను మొదలు పెట్టాలని అన్నారు. మార్చి 31 లోగా ఇళ్ల నిర్మాణం పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో కురుపాం, గుమ్మ లక్ష్మీపురం, సీతంపేట మండలాల్లో ఇంకా మెరుగైన అభివృద్ధి సాధించే దిశగా కృషి చేయాలన్నారు. గృహ నిర్మాణం చేపట్టేటప్పుడు రహదారి, మెటీరియల్ కాంపొనెంట్ లే ఔట్ కి దగ్గర్లో ఉండేలా చూడాలని తెలిపారు. మంజూరైన ఇళ్ళ స్థలాల్లో కచ్చితంగా నిర్మాణం చేపట్టాలని, ఈ నెలలో కనీసం పది ఇళ్ళ నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు వద్దకు వెళ్లే ఇళ్ళు నిర్మించుకునేలా వారికీ అవగాహనా కల్పించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పునాదుల స్థాయి నుండి ఇంటి నిర్మాణం పూర్తి చేసేలా ఇంప్రూవ్ అవ్వాలని కలెక్టర్ అన్నారు. జిల్లాకు ప్రధాన మంత్రి జన్మాన్ పివిటిజి పథకం కింద 2697 ఇళ్ళు మంజూరు అయ్యాయని కలెక్టర్ తెలిపారు. మార్చి 31 నాటికి 184 ఇళ్ళు నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణం సంస్థ పిడి ఆర్. వంశీకృష్ణ, డిఇలు జి. సోమేశ్వరరావు, ఎం. వెంకటరావు, ఐటి మేనేజర్ పి. అనిల్ కుమార్, అన్ని మండలాల ఎఇలు, సిఎల్ టిసి పి. అరుణకుమారి పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: నియోజక వర్గంలో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని అరకు పార్లమెంటు సభ్యులు గుమ్మ తనూజారాణి అన్నారు. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు క్యాంప్ కార్యాలయంలో ప్రజాప్రతినిదులు, నాయకులు వద్ద నుంచి వినతులు స్వీకరించారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న మూడు మండలాలు, పురపాలక సంఘం నుంచి విచ్చేసిన పలువురు ప్రజా ప్రతినిదులు, నాయకులు వద్ద నుంచి పలు సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించి ఆయా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి పూర్తి హామీ ఇవ్వడంతో పాటు నియోజకవర్గ సమస్యలపై జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారం కొరకు ఆమె ప్రత్యేక చొరవ తీసుకోవడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మూడు మండలాలు ఎంపీపీలు మజ్జి శోభారాణి, బలగ శ్రీరాములు నాయుడు, జడ్పీటీసీలు మామిడి బాబ్జి, అలజంగీ రవి కుమార్, బలగ నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు, మండలాల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, పాలవలస మురళీకృష్ణ, బొంగు చిట్టి రాజు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కొండపల్లి రుక్మిణి, రాష్ట్ర దాసరి సంక్షేమ సంఘం అధ్యక్షులు రంగుముద్రి గణపతి, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జిల్లా ఎస్పీ సెల్ అధ్యక్షులు ఏస్ శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్ సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వలస ఆదివాసి గ్రామాలకు కరెంటు, రహదారులు, సౌకర్యాలను కల్పించాలి : గిరిజన సంఘం డిమాండ్

విశాలాంధ్ర-చింతూరు : చింతూరు ఐటిడిఏ పరిధిలో వలస ఆదివాసి గ్రామాల ప్రజానీకానికి రోడ్లు కరెంటు సౌకర్యం కనీస అవసరాలు తీర్చుకునేందుకు ఆదివాసి ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే మౌలిక సౌకర్యాలు కల్పించాలని చింతూరు ఐటిడిఏ పిఓ అపూర్వ భరత్‌కు గిరిజన సంఘం నాయకులు వలస ఆదివాసి ప్రజానీకం వినతి పత్రాన్ని అందించడం జరిగినది. బుధవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో చింతూరు డివిజన్ పరిధిలో ఉన్న 21 వలస ఆదివాసి గ్రామ పెద్దలు గిరిజన సంఘం నాయకులు వలస ఆదివాసి గ్రామాల అభివృద్ధికి కనీస అవసరాలు అయిన విద్యుత్, రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం నాయకులు సీసం సురేష్, ముట్టం రాజయ్య, గ్రామ పెద్దలు మడివి దీపక్, కూంజ జోగారావు, లక్ష్మణరావు గ్రామస్తులు కలిసి వినతి పత్రం అందించారు.

విద్యుత్ చార్జీల పెంపుదలను విరమించుకోవాలి : సిపిఎం

విశాలాంధ్ర-చింతూరు : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై ట్రూ ఆఫ్, సర్దుబాటు చార్జీల పేరుతో 16వేల కోట్లు రూపాయలు బారాలు వేయాలని సిద్ధపడింది. 2025-26 సంవత్సరానికి సంబంధించి విద్యుత్ టార్పులను పెంచే ఆలోచన చేసే విద్యుత్ చార్జీలను పెంచాలని విద్యుత్ పంపిణీ సంస్థలకు సర్కులర్ ఇచ్చిన నేపథ్యంలో మెసేజ్ చార్జర్ పెంపుదల విరమించుకోవాలని, గతం విద్యుత్ టారీఫ్ లానే కొనసాగించాలని, లోపాయికారంగా అదానీతో 1750 కోట్లు కమిషన్ తీసుకొని సోలార్ విద్యుత్ ఒప్పందాలను కుదుర్చుకున్న దాని రద్దు చేయాలని, విద్యుత్ వినియోగదారుల ప్రయోజనాలు కాపాడాలని, చింతూరు మండలంలో విద్యుత్తు లేని గ్రామాలకు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చింతూరు విద్యుత్ ఏడిఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పల్లపు వెంకట్, కార్యదర్శివర్గ సభ్యులు సీసం సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా గత ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచిందని, నేను అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలను తగ్గిస్తానని హామీ ఇచ్చిందని అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఆ హామీని తుంగలో తొక్కి విద్యుత్ చార్జీలు పెంపుదలకు సిద్ధమైందని అన్నారు. 2022 23 సంవత్సరానికి సంబంధించి వాడిన విద్యుత్‌కి 16 వేల కోట్లు అదనంగా వినియోగదారుల నుండి వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని అన్నారు. 2024-25 సంవత్సరానికి 5900 కోట్లు విద్యుత్ పంపిణీ సంస్థకి లోటు రావడంతో ఆ లోటును వినియోదారుల నుండి వసూలు చేయాలని పంపిణీ సంస్థలకు ఆదేశాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపుదలపై రాష్ట్రవ్యాప్తంగా వస్తున్న నిరసనను వ్యతిరేకతను పరిగ నంలో తీసుకొని విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నదని ఈ ప్రజాభిప్రాయ సేకరణలో పారదర్శకంగా వ్యవహరించి విద్యుత్ వినియోగదారులకు న్యాయం జరిగే విధంగా నిర్ణయాలు చేయాలన్నారు. గత ప్రభుత్వం 1750 కోట్లు కమిషన్ తీసుకొని ఆదానికి సోలార్ విద్యుత్ సంబంధించి లోపాయికారి ఒప్పందాలని చేసుకున్నదని దీనిమీద విచారణ చేయకుండా ఈ ప్రభుత్వం కూడా అదానికి విద్యుత్ని కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. విద్యుత్ పంపిణీ సంస్థలకి ప్రభుత్వం చెల్లించాల్సిన 43 వేల కోట్లు చెల్లించి విద్యుత్ సంస్థలకు న్యాయం చేయాలని, విద్యుత్ చార్జీల పెంపుదలను విరమించుకొని విద్యుత్ వినియోగదారులపై వేసే భారాలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఆలోచనలు విరమించుకోవా లని డిమాండ్ చేశారు. చింతూరు మండలంలో ఉన్న బలిమెల, చుక్కలపాడు, కొత్తూరు, చిన్న ఏడురాలపల్లి, పవర్ లంక గ్రామాలకు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. అనంతరం ఏడిఈ రిప్రజెంటేషన్ అందించడం జరిగింది. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్, పోడియం లక్ష్మణ్, కలుముల మల్లేష్, కారం సుబ్బారావు, చింతా రాంబాబు, సవలం కన్నయ్య, ముట్టం రాజయ్య, మొర్రం పెదగయ్య, సోడి లెనిన్, పల్లపు పెదరాములు, తెపల్లె లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతల్లో పందెం రాయుళ్ల సందడి

విశాలాంధ్ర -దేవీపట్నం: సంక్రాంతి సమీపిస్తుండటం తో మూడు రోజుల పండగ దినాల్లో కోడి పందేలు జరగటం పరిపాటి. దీని కోసం గ్రామాల్లో 6నెలల ముందు నుంచే కోళ్లకు బాదం పిస్తా వంటి పౌష్టికాహారం తో పాటు ఉదయాన్నే చన్నీటి స్నానం కోళ్లకు చేయిస్తూ ఉంటారు. పండగ ముందు వారం జరిగే వారపు సంతలో పందెం రాయుళ్లు సందడి చేశారు. జాతి కోళ్ల కోసం రెహార్శలు చేశారు. ప్రభుత్వం,పోలీసులు ఎన్ని ఆంక్షలు ఉన్నా పండగ వచ్చిందంటే పందెం రాయుళ్లకు పందెలు కిక్కే వేరు. పండగ పూట ఫస్టులుండటానికైనా సిద్దమే కానీ పందేలకు వెళ్ళని వ్యసనపరులు ఉండరంటే అతిశయోక్తి కాదు. పందెం కోళ్ల కు మంచి గిరాఖీ కూడా ఉంటుంది. ఒక్కో కోడి రూ. రెండు వేల నుంచి రూ. ఇరవై వేల వరకు ధర పలుకుతాయ్యంటే విశేషమేమి కాదు. రాను రాను తగ్గుతున్న పండగ సందడిని ఈ కోడి పందెలే భర్తీ చేస్తున్నాయంటే కాదని చెప్పలేం. ఆంక్షలు దాటి పందెం రాయుళ్ల సందడి ఎలా ఉంటుందో చూడాలి.

కిటకిటలాడిన చింతపల్లి వారపు సంత

పండగ సంత కావడంతో జనసంద్రమైన చింతపల్లి

వారపు సంతలో చేతివాటం ప్రదర్శించిన చోరులు

విశాలాంధ్ర-చింతపల్లి : మన్యప్రాంత ప్రజానీకంతో చింతపల్లి వారపు సంత బుధవారం కిటకిటలాడింది. మన్య ప్రాంతంలో ప్రతిరోజు ఏదో ఒక గ్రామంలో వారపు సంత జరుగుతుండడం పరిపాటి. అయితే సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని జరుగుతున్న వారపు సంత కావడంతో బుధవారం చింతపల్లి వారపు సంత జన సందోహంతో కిటకిటలాడింది. ప్రతి వారం వచ్చే వ్యాపారుల కంటే రెట్టింపు వ్యాపారులు రావడం, ప్రజలు సైతం ప్రతి వారం వచ్చే దానికంటే నాలుగు రెట్లకు పైగా తరలి రావడంతో బుధవారపు చింతపల్లి వారపు సంత జన సంద్రాన్ని తలపించింది. పండగ సంత కావడంతో ప్రతి ఒక్కరూ బట్టలు, కిరాణా, కూరగాయలు, ఫ్యాన్సీ, చెప్పులు, తదితర దుకాణాలు ప్రజలతో కిటకిట లాడాయి. ఇదే అదనుగా భావించిన కొంతమంది చోరులు వారపు సంతలో తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. ఈ క్రమంలో రింతాడకు చెందిన గృహిణి పర్స్ ను దొంగలు కాజేయడంతో ఆ పర్స్ లో 7వేల రూపాయల నగదు తో పాటు సెల్ఫోన్, కుటుంబ సభ్యుల యొక్క ఆధార్ కార్డులు అందులోనే ఉన్నాయని ఆమె లబోదిబో మంటూ బోరున విలపించింది.

నిరుపేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

ఎస్ఏఎన్ చారిటీ ఫౌండర్ అప్పలనాయుడు

విశాలాంధ్ర-చింతపల్లి : నిత్యం శీతల వాతావరణానికి పేరెన్నిక గన్న ఆంధ్ర కశ్మీర్ లంబసింగి ప్రాంతంలోని వివిధ గ్రామాల నిరుపేద గిరిజనులకు తిరుపతికి చెందిన పీపుల్స్ చారిటీ వారి ఆర్థిక సహకారంతో సుమారు 400 మందికి దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందని నర్సీపట్నం కి చెందిన ఎస్ఏఎన్ చారిటీ ఫౌండర్ సూరెడ్డి అప్పలనాయుడు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పర్యాటక ప్రాంతమైన లంబసింగి పంచాయతీ పరిధిలోని గ్రామాలైన చెరువుల వనం (మేఘాల కొండ), భీమనాపల్లి, రింగుడు మెట్ట, బంతి బైలు, చీకటి మామిడి, టేకు బంధ, వాడగెడ్డ తదితర గ్రామాలలోని గిరిజనులు చలి తీవ్రతతో ఇబ్బంది పడుతున్న దృష్ట్యా ఆ పరిస్థితులను గుర్తించిన సేవా సంస్థలు బుధవారం ఆ పంచాయతీ మాజీ సర్పంచ్ కొర్రా రఘునాథ్, వైకాపా సీనియర్ నాయకుడు రావుల నూకరాజు, గ్రామ పెద్ద సరమండ నాగరాజు లతో కలిసి సుమారు 400 మందికి పైగా నిరుపేద గిరిజనులకు దుపట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలన

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా విఆర్ పురం మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో వెలసి ఉన్న శ్రీ సుందర సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే తెప్పోత్సవ వేడుకల ఏర్పాట్లను బుధవారం ముక్కోటి ఉత్సవ కమిటీ సభ్యులు బృందం ఆలయ ప్రాకారాలను ఏర్పాట్లను పరిశీలించారు. సాయంత్రం నాలుగు గంటలకు స్వామివారి ఆలయం నుండి ఉత్సవ మూర్తులను పల్లకిలో పవిత్ర గోదావరి నదిపై ఏర్పాటు చేసిన హంస వాహనం గల బోటుపై ఆశీనులు గావించనున్న నేపద్యంలో వారు గోదావరి స్నాన ఘట్టాలను పరిశీలించారు. ఆలయ అధికారులతో మాట్లాదారు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లను సభ్యుల బృందం పరిశీలించారు. స్వామివారి తెప్పోత్స వాన్ని భక్తులందరూ జయప్రదం చేయాలని వారు కోరారు .ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ బృంద సభ్యులు పెందుర్తి సుదర్శన్‌రావు నాలారపు సత్యనారాయణ కోట్ల రామ్మోహన్ రెడ్డి ఆలయ అధికారులు సాయిబాబు జనసేన మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ కార్యదర్శి బాగుల అంజన్ రావు గ్రామస్తులు ఆత్మకూరు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్, వాలీబాల్ టోర్నీ ప్రారంభించిన రమేష్‌నాయుడు

- విద్యతో పాటు ఆటపాటలు కూడా ముఖ్యమే
- నిర్వాహకుడు ఖాన్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపిన రమేష్‌నాయుడు
- ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు పొందండి

విశాలాంధ్ర -జివమాదుగుల: బుధవారం మండలంలోగల వంజరి పంచాయితీకి ముదుపల్లి గ్రామంలో క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్‌ను ఏపీ టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకట రమేష్‌నాయుడు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి, మానవుడు ఆరోగ్యంగా ఉండడానికి క్రీడలు ఎంతో ఆరోగ్యాన్నిస్తుందని, క్రీడారంగంలో ఉన్నత స్థాయికి చేరుకుంటే మన దేశానికే గౌరవం తీసుకురావచ్చని ఆయన వివరించారు. అలాగే సభ్యత నమోదు ప్రక్రియ 12 తారీకు తో ముగుస్తుంది కాబట్టి ప్రతి ఒక్కరు తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు పొందాలని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కోడ వెంకట సురేష్‌కుమార్, రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు సోమల చిట్టిబాబు,సీనియర్ నాయకుడు శోభ శ్రీనివాస్,ఖాన్, మాజీ ఎంపిటిసి కె ప్రకాశరావు,కృష్ణ, మత్యరాజు, గెమ్మెలి దేముడు తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

విశాలాంధ్ర-అనంతగిరి : కాఫీ పిక్కలు దళారులకు ఆశ్రయించి మోసపోవద్దని ఐటీడీఏ లేదా జిసిసి సంస్థలకు అమ్మకం చేపట్టాలని గుమ్మకోట సేల్స్ మెన్, అనంతగిరి ఇన్చార్జి, డి.అప్పన్న దొర రైతులను కోరారు సోమవారం అనంతగిరి పంచాయతీ పరిధి రాజుపాక గ్రామంలో సందర్శించి కాఫీ పంట దిగుబడి. నష్టాలపై రైతులతో అడిగి తెలుసుకున్నారు అలాగే మాలింగవలస అనంతగిరి. తాడిగుడ గ్రామాల్లో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడది మంచి లాభాలతో కాఫీ కొనుగోలు జరుగుతుందని దళారులకు ఆశ్రయించి తూనికలలో మోసపోవద్దని స్పష్టం చేశారు అనంతగిరి. దమ్ముకు. ఎగువ మశోభ బొర్రా వంటి ప్రధాన కేంద్రాలలో జిసిసి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఉందని ఆ కేంద్రంలో రైతులు రవాణా అమ్మకలు చేపట్టుకోవాలని లేదా నేరుగా తమకు సంప్రదిస్తే తామే గ్రామాల్లోకి వచ్చి కొనుగోలు చేస్తామని అన్నారు పర్చ్మెంట్ కాఫీ పీకల ధర సుమారు 320 పైగా ఉందని చివరి దప్ప కావస్తుండడంతో 500 ధర వరకు పలికె అవకాశాలు ఉన్నాయని తెలిపారు తమ జిసిసి సంస్థకు అమ్మకం చేపట్టిన రైతులకు కాఫీ తోట అభివృద్ధికి లేదా వ్యక్తిగత రుణాలు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో సేల్స్‌మెన్ కె.అప్పలస్వామి కాఫీ రైతులు జె. రామన్న.రాజు.డి.సింహాద్రి జె.అప్పాలరాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

విశాలాంధ్ర-జి కె వీధి : మండలంలో కౌమార దశలో పాఠశాల డ్రాప్ అవుట్ బాలికలను 402 మందిని గుర్తించామని కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రాజెక్టు అధికారి ఏ.లక్ష్మీదేవి జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి డాక్టర్ పి.రోహిణి వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్లూరి సీతారామ రాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం 102 బాలికలకు ముందస్తు వివాహాల వల్ల కలిగే అనర్థాలు నష్టాలు గురించి పూర్తిస్థాయిలో వివరించడం జరిగిందన్నారు. మధ్యలోనే విద్యను నిలిపివేసిన బాలికలకు మరల విద్యను ప్రారంభించడానికి వాళ్ల జీవనోపాధి మెరుగుపరుస్తూనే అవకాశాలు కోసం క్లుప్తంగా వివరించామని పేర్కొన్నారు. బాలికలకు ఎటువంటి శిక్షణపై ఆసక్తి ఉందో వాళ్ల ద్వారా తెలుసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి రోహిణి సిడిపిఓ ఏ లక్ష్మీదేవి స్కిల్ డెవలప్మెంట్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ తహసిల్దార్ చేతులమీదుగా వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

విశాలాంధ్ర-దేవీపట్నం : దేవీపట్నం మండలం ఇందుకూరు గ్రామంలోని ముత్యాలమ్మతల్లి గుడి వెనుక ఎంపీపీ స్కూల్ ఎదురుగా ఉన్న ప్లే గ్రౌండ్లో బుధవారం దేవీపట్నం మండల డిప్యూటీ తహసిల్దార్ పి.జనార్ధన్‌రావు దేవీపట్నం మండల లెవెల్ వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవిపట్నం మండల డిప్యూటీ తాసిల్దార్ పి.జనార్ధన్‌రావు మాట్లాడుతూ క్రిస్మస్, నూతన సంవత్సర మరియు సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రారంభించిన దేవీపట్నం మండల లెవెల్ వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న ప్లేయర్స్ అందరూ స్నేహభావంతో ఎటువంటి గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఆటలు ఆడుకోవాలన్నారు. గెలిపొందిన విజేతలకు మొదటి బహుమతి ప్రైజ్ మనీ పదివేల రూపాయలు కీర్తిశేషులు సిద్ధ బత్తుల భాస్కరరావు, రెండో బహుమతి ప్రైజ్ మనీ ఐదు వేల రూపాయలు కీర్తిశేషులు సిద్ధబత్తుల శశిరేఖ,మూడో బహుమతి ప్రైజ్ మనీ మూడు వేల రూపాయలు కీర్తిశేషులు గొద్దలి సత్యనారాయణ,సీల్డ్ బహుమతులు కీర్తిశేషులు సింబోతుల నాగకుమారి,కీర్తిశేషులు దూసరి బాబురావు గార్ల జ్ఞాపకార్థం గెలుపొందిన వారికి 13వ తేదీన అందించడం జరుగుతుందన్నారు. ఆర్గనైజర్ ఎస్.రవి మాట్లాడుతూ దేవీపట్నం మండల లెవెల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను రిబ్బన్ కట్‌చేసి, మొదటి వాలీబాల్ టీమ్స్ మడిపల్లి,కచ్చులూరు టీమ్స్ మధ్య వాలీబాల్ సర్వీస్‌చేసి దేవీపట్నం డిప్యూటీ తహసిల్దార్ పి.జనార్ధన్‌రావు, ఎంపీటీసీ తుర్రం జగదీష్‌దొర ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో జగన్, బందారు వీరబాబు, సింబోతుల దుర్గాప్రసాద్,ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్,ఆదివాసి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి,బిజెపి మండల అధ్యక్షుడు కారం రామన్న దొర, డి.హరిబాబు, కె.శ్రీధర్, సిహెచ్.విద్యాసాగర్, వాలీబాల్ ఆర్గనైజర్లు, అధికసంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

మురగడపల్లి గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణం శంకుస్థాపన

విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్త వీధి మండలం వంచులు పంచాయతీ పరిధి మురాగడపల్లి గ్రామంలో సర్పంచ్ వనపాల కసులమ్మ ఎంపీపీ బోయని కుమారి ఆధ్వర్యంలో 75 మీటర్లు మూడు లక్షలా వ్యయం తో సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేసి నిర్వహించి కొబ్బరికాయ కొట్టి సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడం జరిగింది. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు టి డి, పీ మండల ప్రధానకార్యదర్శి పొత్తురు కొండలరావు, ఎంపిటిసి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

రెవిన్యూ సదస్సుతో భూ సమస్యలు పరిష్కారం : సర్పంచ్ అప్పారావు

విశాలాంధ్ర-అనంతగిరి : రెవిన్యూ సదస్సు ఏర్పాటుతో దీర్ఘకాలికంగా నిలిచిపోయిన భూ సమస్యలు పరిష్కార మార్గం సాధ్యపడుతుందని ఇన్ సర్జి తహశీల్దార్ ఎస్ మాణిక్యం. గుమ్మకోట సర్పంచ్ పాగి. అప్పారావు లు అన్నారు బుధవారం స్థానిక శివాలయంలో సర్పంచ్ ఆధ్వన ఈ రెవెన్యూ సదస్సు జరిగింది ఈ సందర్భంగా సదస్సులు హాజరైన గిరిజన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ పట్టా మార్పిడి .మ్యుటేషన్. పెండింగ్ ఉన్న భూ సమస్యలు సాగు రైతులు సదస్సులో దరఖాస్తులు అందజేసినట్లయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు వాటిని పరిష్కరించేందుకు రెవిన్యూ యంత్రాంగం పనిచేస్తుందని వారన్నారు. పంచాయతీ పనులు గ్రామాలనుండి అనేక భూ సమస్యలపై విడివిడిగా దరఖాస్తులను అధికారులకు అందజేశారు సుమారు 350 దరఖాస్తులు స్వీకరించారు ఈ కార్యక్రమంలో డీటి.రామూర్తి. ఆర్ఐ.శంకర్రావు విఆర్ఓ. కోటి బాబు ఎంపిటిసి. తవిటినాయడు.మాజీ ఎంపిటిసి. కొండమ్మ గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి ఎనీమా యాక్షన్ కమిటీ సమావేశం

విశాలాంధ్ర-సీతానగరం : మండలస్థాయి యాక్షన్ కమిటీ సమావేశంను బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిడిఓ పాండ్రంకి త్రివిక్రమరావు అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాలమేరకు గ్రామస్థాయిలో రక్తహీనత నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఇప్పటికే గ్రామస్థాయిలో కమిటీలు ఉండగా మండల స్థాయిలో కూడా కమిటీలు వేసి ఒక్కొక్క మండల స్థాయి అధికారి 2నుండి మూడు సచివాలయాలను పర్యవేక్షణ చేయాలని తెలిపారు. దీనికి సంబంధించి అన్ని అంశాలపై వైద్యులతో చర్చించారు. ఎనీమియా లేకుండా ఉండేందుకు అన్ని శాఖలు సిబ్బంది సమన్వయంతో పని చేద్దామన్నారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ ప్రసన్న కుమార్, మండల పంచాయతీ విస్తరణ అధికారి కుమార్‌వర్మ, వైద్యులు రాధాకాంత్, ఉషారాణి, పావని, ఐసీడీఎస్ పీఓ సులేఖ, ఎంఈఓ సూరిదేముడు సిహెచ్ఓలు సూర్యనారాయణ, ఎస్వీ రమణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే అవగాహన సభ నిర్వహణ

విశాలాంధ్ర-అనంతగిరి : టోకూరు పంచాయతీ జాకరవలస గ్రామంలో సర్పంచ్ కిల్లో మోస్య అధ్యక్షతన రీసర్వే అవగాహన సభ నిర్వహించారు. ముఖ్య అతిధిగా అనంతగిరి తాసిల్దార్ హజరు అయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రీ సర్వే పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా మండలంలో జాకరవలస గ్రామం సెలక్ట్ చేసిందని తెలిపారు రైతులు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు మందే రైతులు హద్దులు ఏర్పాటు చేసుకుని ఉంటే సర్వే బృందం వచ్చి సర్వే చేస్తారని తెలిపారు సర్పంచ్ కిల్లో మోస్య మాట్లాడుతూ రీ సర్వే ద్వారా నిస్పక్షంగా సర్వే చేసి రైతులకు న్యాయం చేయాలని ఎవరైతే సాగులో ఉన్నారో వారి పేరునే సర్వే చెయలని కోరారు ఈకార్యక్రమంలో రీ సర్వే డీటి రాముర్తి ఆర్ఐ శంకరరావు మండల సర్వేయర్ శ్రీనివాసరావు దాసు విఆర్ఓ రాంబాబు సచివాలయ సర్వే సునీల్ పెషా కమిటీ ఉపాధ్యక్షులు పాంగి గోపన్న గ్రామస్తులు నరాజి దొన్ను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవత పండుగ

విశాలాంధ్ర-బెలగాం : సీతానగరం మండలం బూర్జ గ్రామంలో చిన్నమ్మ వారు గ్రామ దేవత పండుగ ఘనంగా జరిగింది. ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు బుధవారం తన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో స్వగ్రామంలో అమ్మవారి సేవలో ఘటాన్ని ధరించి ఘట శ్రేణిలో పాల్గొన్నారు. సంప్రదాయ భక్తి శ్రద్ధలతో అందరూ ఊరి ఆవల ఉన్న చిన్నమ్మవారి గుడి వద్దకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. బూర్జ గ్రామదేవత చిన్నమ్మ వారు ఊరు ఇలవేల్పు అని, సంప్రదాయంగా రెండేళ్ళకు ఒకసారి పండగ జరుపుకుంటున్నామని, పంటలు బాగా పండి గ్రామం సుభిక్షంగా ఉంటూ అందరూ ఆయురారోగ్యాలతో ఉంటామని అమ్మవారు మాకెంతో నమ్మకమని అన్నారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్ గ్రామంలో ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలు వినియోగించుకుంటున్న వారి ఆరోగ్య సమస్యలు, చికిత్సా వివరాలు పరిశీలించారు.

ఎస్ఎన్ఎం నగర్ కాలనీలో అభివృద్ధిని కోరుతూ ఎంపీకి వినతి

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం పురపాలక సంఘం 4వ వార్డు పరిధిలో గల సౌందర్య నారాయణ మూర్తి నగర్ కాలనీకి (ఎస్ఎన్ఎం నగర్) చెందిన పలువురు పెద్దలు కాలనీలో మౌలిక సదుపాయాలైన 3 సిమ్మెంటు రోడ్లు అత్యవసరమని, అలాగే కాలువల్లో మురికినీరు ఇంటి ముందే నిల్వ వుండిపోతుందని, కాలువలు పూర్తి స్థాయిలో ప్రక్షాళన చెయ్యవలసిన అవసరం వున్నదని కావున మా కాలనీకి 3సిసి రోడ్లు మరియు కాలువలు విషయం వెంటనే పరిశీలించి నిధులు మంజూరు చెయ్యవలసినదిగా కోరుతూ బుదవారం స్థానిక మాజీ శాసనసభ్యులు అలజంగి జోగారావు నివాసంలో ఆయన సమక్షంలో అరుకు పార్లమెంట్ సభ్యులు గుమ్మా తనూజారాణికి వినతిపత్రం అందజేసి అభివృద్ధికి సహకరించాలని ఆమెను కాలనీ పెద్దలు కోరడం జరిగినది. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు గొర్లి శంకరరావు, సర్పంచ్ పెంకి స్రవంతి, కాలనీ పెద్దలు జల్లు రామకృష్ణ, సాలాపు అనంతరావు, పెండ రమణ, గొర్లి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య పంటలు వద్దు... ప్రత్యామ్నాయ పంటలే ముద్దు

- గంజాయి పంటకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన
- మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-చింతపల్లి: పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిరోధక చట్టం, గంజాయి పంటకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం గొంది పాకల పంచాయతీ చిన్నబరడ, పెద బరడ పంచాయతీ చింతలూరు గ్రామాల్లో నిర్వహించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి బి శ్రీనివాసరావు అన్నారు. చిన్న బరడ, చింతలూరు గ్రామాలలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిరోధక చట్టం, గంజాయి పంటకు ప్రత్యామ్నాయ పంటలపై గిరిజనులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అదే క్రమంలో భూసార పరీక్షలు వాటి ప్రాముఖ్యత, వ్యవసాయ యంత్ర పరికరాలు, పీఎం కిసాన్, జాతీయ ఆహార భద్రత పథకం, ఈ పంట ప్రాముఖ్యత, రైతు గుర్తింపు కార్డ్ ప్రాముఖ్యత, బిందు సేద్యం అవశ్యకత, ప్రకృతి వ్యవసాయం పై అవగాహన గిరిజన రైతులకు అవగాహన కల్పించడం జరిగిందని, పై విషయాలపై ప్రతి ఒక్క రైతు పూర్తి పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-అరకులోయ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించరు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి భోగి, సంక్రాంతి వంటి సాంప్రదాయక పండగలు ప్రజల సుఖసంతోషాలతో వెలుగును నింపుతాయని, ఇటువంటి పండగలు గురించి విద్యార్థినిలు తెలుసుకుంటూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలియజేశారు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిడిసి మెంబర్స్ మయూరి రాజు, పి నారాయణ, రామరాజు అలాగే దండకారణ్య యజమాన్యం కె.శ్రీనుబాబు, రంగ పాల్గొన్నారు. అలాగే సీపీడీసీ బృందంతో కళాశాల ప్రిన్సిపాల్ కళాశాల అభివృద్ధి కొరకు చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుష్పరాజు, ఎన్ఎస్ఎస్ పిఓ పి నాగబాబు, ఉమెన్ ఎన్విరాన్మెంట్ కన్వీనర్ సుందరి రాణి, ఉమెన్ ఎన్విరాన్మెంట్ సభ్యురాలు విజయలక్ష్మి, అనితకుమారి, మరియు అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే మహిళా కళాశాల అధ్యాపక, అధ్యాపకేత్తర బృందం మరియు విద్యార్థినులు నృత్యాలతో సందడి చేసి సంబరాలను విజయవంతం చేశారు.

రెవెన్యూ సదస్సు నిర్వహణ

విశాలాంధ్ర-హుకుంపేట : మండల కేంద్రంలో స్థానిక గ్రామ పంచాయతీలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వీ ఆర్ ఓ రత్న కుమారి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో స్థానిక తహసిల్దార్ జైప్రకాష్ మాట్లాడుతూ గిరిజనుల భూ సమస్యలు ఈ రెవెన్యూ సదస్సులో తెలియజేయాలని కోరారు. మండల కేంద్రంలో భూ సమస్యలు ఎక్కువ ఉందని. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన అన్నారు. అనంతరం మండల కేంద్రంలో గిరిజనేతరులు చేపట్టిన అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు పైన గిరిజన సంఘం నాయకులు సిల్దార్‌కు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకురాలు ఎస్.హైమావతి మాట్లాడుతూ మండల కేంద్రంలో గిరిజనేతారులు విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. వీటిపై అనేక మార్లు గిరిజన సంఘం, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకునే దాఖలు లేవని ఆమె అన్నారు.రెవెన్యూ అధికారులు బినామీలకు కొమ్ముకాస్తూ నిజమైన గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని ఆమె అన్నారు. అక్రమనిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు. కొంతమంది గిరిజన దళారిలతో కుమ్మక్కై క్రయ విక్రయాలు జరుపుకొంటున్నారన్నారు. సర్వే నెంబర్ 68లో 30 సెంట్లు,70లో 54సెంట్లు, 42/8లో 55సెంట్లు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని ఉన్నారన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ శాఖ అధికారులు స్వాధీనం చేసుకొని భు ఆక్రమణ దారులపై 2024 లెండ్ గ్రభింగ్ చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి వైస్ ఎంపీపీ కొండల రావు స్థానిక ఎంపీటీసీ కొమ్మ రమా, ఆర్ఐ సీతమ్మ, మండల సర్వేయర్ సింహాచలం, పెసా ఉప అధ్యక్షులు, గెమ్మెలి ఆనంద్, కొంతేలి వైస్ ప్రెసిడెంట్ డి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మారినా... తీరని నీటి కష్టాలు

విశాలాంధ్ర-సీలేరు : జికెవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ చెందిన అన్నవరం గ్రామంలో మంచినీటి సమస్య వల్ల చాలా ఇబ్బందులకు గురవుతున్నామని, అలాగే సంబంధిత అధికారులకు, నాయకులకు ఫిర్యాదు చేసి చెప్పిన సరే మా సమస్యల మీద ఇప్పటివరకు ఏ అధికారులు మాకు స్పందించడం లేదని వాపోతున్నారు. మేము మా గ్రామంలో మంచినీరు లేకపోవడం వలన కాలు సరిహద్దుల్లో ఊటలాగా చేసుకుని అది మంచినీరుగా వాడుకుంటున్నాము. ఇప్పటికైనా మా బాధలు అర్థం చేసుకొని ప్రభుత్వ అధికారులు అలాగే కూటమి నాయకులు మంచినీటి సమస్యను తీర్చగలరని మాగ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్ట్ జీవో నెంబర్ 3పై ఎన్డీఏ కూటమి ప్రభుత్వాల వైఖరి స్పష్టం చేయాలి

ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చిన్నయ్య పడాల్

విశాలాంధ్ర-చింతపల్లి : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖ పర్యటన సందర్భంగా హైడ్రోపవర్ ప్రాజెక్టు, జీవో నెంబర్ 3 లపై కేంద్ర, రాష్ట్రాలలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాల వైఖరి ఏంటో స్పష్టం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మండల కేంద్రంలో బుధవారం ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు, జీవో నెంబర్ 3 కి చట్టబద్ధత పై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు నరేంద్ర మోదీ చేత ప్రకటన చేయించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతపల్లి, కొయ్యూరు మండలాల సరిహద్దు అటవీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి గత వైకాపా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన రెడ్డి అనుమతి ఇచ్చారని, విద్యుత్ ఉత్పత్తి కోసం అటవీ ప్రాంతంలో నిర్మిస్తున్న రెండు భారీ డ్యాములలో చింతపల్లి మండలంలోని ఎర్ర బొమ్మలు, గొందిపాకల, కొయ్యూరు మండలంలోని పెద మాకవరం, వెలగల పాలెం పంచాయతీలలో సుమారు 32 గ్రామాల గిరిజన ప్రజలు ఈ డ్యామ్ ల నిర్మాణం వల్ల నిరాశ్రయులయ్యే ప్రమాదం ఉందన్నారు. అదే క్రమంలో అనంతగిరి మండలంలో మరో రెండు డ్యాములను కార్పొరేట్ దిగ్గజం ఆదానికి కట్టబెట్టిందన్నారు. దీనివలన జీడి తోటలు, పంట పొలాలు, గృహాలతో పాటు సర్వస్వం కోల్పోయి గిరిజనులు వలస వెళ్లక తప్పని పరిస్థితి ఉంటుందన్నారు. తాత ముత్తాతల జ్ఞాపకాలను, వారసత్వ సంపద అయిన భూమి, గ్రామాలు మునిగిపోయి దిక్కుతోచని పరిస్థితిలో అగమ్యగోచరంగా గిరిజనుల బతుకులు మారే ప్రమాదం లేకపోలేదు అన్నారు. గిరిజనులను ముంచడానికి కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం వెనక్కి తగ్గే ఆలోచన చేయడం లేదని మండిపడ్డారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతూ అటవీ, పర్యావరణ అనుమతులు కూడా మంజూరు చేశారన్నారు. న్యూ రెన్యూబుల్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ లిమిటెడ్ (%చీ=జుణజాూా%)కు ఏకంగా వేలాది ఎకరాల అటవీ ప్రాంతాలను గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిందని. గిరిజన చట్టాలను తుంగలో తొక్కి పీసా గ్రామ సభ ఆమోదం లేకుండానే 32 గిరిజన గ్రామాలను ముంచే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులను రద్దు చేయాలని గత ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలను ఈ రాష్ట్ర ప్రభుత్వం మోడీ చేత రద్దు చేయించాలని కోరారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న జనసేన, టిడిపి నాయకులు హైడ్రోపవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని పోటీపడి మరి పత్రిక ప్రకటనలు ఇచ్చారని అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ రోజున ప్రకటన ఇచ్చినవాళ్లు ఈ రోజున దానిపై నోరు మెదపడం లేదని ఆరోపించారు. జీవో నెంబర్ 3 రద్దుచేసి సుమారు నాలుగేళు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు. జీవో నెంబర్ 3 రద్దు వల్ల ఇటీవలి ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు పొందవలసిన ఉద్యోగాలన్నీ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన గిరిజనేతరులు పొందుతున్నారని, ఇది గిరిజన ప్రాంతమా, కాదా అనే భ్రమల్లో ఆదివాసి గిరిజనులున్నారన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న కూటమి నాయకులు గిరిజనులుకాదా,వారి కుటుంబాలకి జీవో నెంబర్ 3 వర్తించదా! అని నిలదీశారు. జీవో నెంబర్ 3 చట్టబద్ధత కోసం మోడీని ప్రశ్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్, మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి, మజ్జి రాంబాబు, కిల్లో సింహాచలం, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ బాధిత గ్రామాల గిరిజనులు పాంగి చిన్నారావు, మర్రి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పండగ సమయాల్లో యువకులు ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర-కొమరాడ : పండగ సమయాల్లో ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని కొమరాడ ఎస్సై కె .నీలకంఠం అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆ వారలో ప్రజలకు రోడ్డు ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పండగ ప్రాంతాల్లో వివిధ ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు వస్తున్న ప్రజలతో పాటు గ్రామాల్లో ఉన్న ప్రజలు యువత జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి మితిమీరిన వేగంతో వాహనాల నడిపి ప్రమాదాలకు కారణం కావొద్దు అని అన్నారు. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల ప్రకారం వాహందారులకు అవగాహన కల్పించారు. వాహనదారులందరూ తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన పత్రాలు వాహనంలో ఉంచుకోవాలంటే లేదంటే ప్రమాదం జరిగినప్పుడు ఇబ్బందులు పడపలసిన అవసరం ఉంటుందని అన్నారు. వాహందారులందరూ జాగ్రత్తలు పాటించాలంటూ ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలంటూ ఆయన అన్నారు. 18 సంవత్సరాలు లోపు ఉన్న యువతీ యువకులు ఎవలు కూడా ద్విచక్ర వాహనాలు నడప రాదని నడిపితే మాత్రం కట్ట పరంగా చర్యలు తప్పవని ఆయన అన్నారు ముఖ్యంగా ఆటో వాహనంలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రయాణాలు చేయడం మంచిది కాదని హెచ్చరించారు. వాహనదారులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. ముఖ్యంగా వాహనాలు నడిపే సమయంలో సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలకు కారణం అవ్వచ్చు అని తెలిపారు. యువత గంజాయి, ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు అన్నారు. ముఖ్యంగా ఏవాహనంకైనా సంబంధించిన ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలని ద్రోపత్రాలు లేకుండా వాహనాలు నడిపితే వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను తప్పకుండా పాటించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో బెల్టు దందా... పుట్టగొడుగుల్లా బెల్టు షాపులు

విశాలాంధ్ర-ఎటపాక : గ్రామాల్లో ఎక్కడ చూసినా బెల్టు షాపుల కిక్కు ఫుల్లుగా కనిపిస్తోంది. ఏ గ్రామంలో చూసినా ఎక్కడ చూసినా బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నిర్వాహకులు అనుమతులు లేకుండా విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. వయసుతో సంబంధం లేకుండా యువత మద్యానికి బానిస అవుతూ జీవితాలను నాశనం చేసు కుంటున్నారు. యువత మద్యానికి బానిసవుతున్నారు. తనిఖీలు చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు ముడుపులు తీసుకుని మౌనంగా ఉంటున్నారని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని బెల్ట్ షాపులు మూడు పువ్వులు ఆరు కాయలుగా జోరుగా సాగుతున్నాయి. మండలములో ఎటపాక 1, నెల్లిపాక1, రెండూ వైన్స్ షాపులున్నాయి. షాపుల నుండి నేరుగా బెల్టుషాపులకు మద్యం బాటిల్స్ వెళ్తున్నాయి. గ్రామంలో 5, లేదా 10 షాపులు మద్యం బెల్ట్ షాపులలో ఎక్కువగా ఉంటున్నయి. అంతేకాకుండా ఒక్కో బెల్టు షాపు నుంచి ఎక్సైజ్ శాఖలోని కొంతమంది అవినీతి అధికారులకు భారీగా ముడుపులు ఇస్తున్నట్లు గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపుల నిర్వాహకులే స్వయంగా ఆరో పిస్తున్నారు. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారి వైపు ఎక్సైజ్ శాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో అంతర్యమేమిటని పలు వురు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారనే సమాచారం తెలిపినా తూతూ మంత్రంగా తనిఖీలు చేపడుతూ అధికారులు చేతులు దులుపు కుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇదిలా ఉంటే మరోవైపు బెల్ట్ షాపుల నిర్వాహకులు మద్యం బాటిళ్ల పై అధికంగా వసూలు చేస్తూ దండుకుంటున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా పల్లెల్లో బెల్ట్ షాపుల వైపు ఎక్సైజ్ శాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది. ఇప్పటికైనా అబ్కారీ శాఖ అధికారులు బెల్టు దుకాణాల నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించి పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్టు షాపుల పై కఠిన చర్యలు తీసుకోవాలని యువత, ప్రజలు మద్యానికి బానిస కాకుండా అరికట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి హామీ పథక అభివృద్ధి సుస్థిర ఆస్తుల కల్పనకు కృషి చేయండి

ఆ పథకం ఉద్యోగులకు సూచించిన ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీడి లోకేష్

విశాలాంధ్ర-చింతపల్లి : ఉపాధి హామీ పథకం అభివృద్ధి, సుస్థిర ఆస్తుల కల్పనతో పాటు జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి వందరోజుల ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవో యుఎస్వి శ్రీనివాసరావు, ఆ పథకం ఏపీడి లోకేష్ అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్లస్టర్ స్థాయి శిక్షణ సమావేశం బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వ హించారు. చింతపల్లి, జీకే వీధి మండలాలకు సంబంధించిన ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అభివృద్ధి, సుస్థిర ఆస్తులు కల్పన, ప్రతీ జాబ్ కార్డుదారునికి 100 రోజుల పనికల్పన, ప్రతిరోజు 300 రూపాయల కూలి పొందే విధంగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు వివిధ విభాగాలలో ఉన్న ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈశిక్షణలో ఆ పథకం చింతపల్లి జికెవిధి మండలాల ఏపీఓలు, ఈసీలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

గంజాయి నిర్మూలనకు కమిటీలు ఏర్పాట్లు

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ ఆదేశించారు. ప్రతీ పాఠశాలలో ఒకే ప్రామాణికా విధానాన్ని అమలు చేయాలని చెప్పారు. పది విద్యార్థుల వంద రోజుల కార్య చరణ ప్రణాళిక పక్కాగా అమలు చేయాలని స్పష్టమై ఆదేశాలు జారీ చేసారు. సహాయ గిరిజన సంక్షేమాధికారులు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్తో ఐటిడిఏ సమావేశ మందిరంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు జారీ చేసిన ఫార్మాట్ ?, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రతీ నెల నివేదికలు సమర్పించాలని స్పష్టం చేసారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు ఉంటే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిక్ రూంలో ఉంచాలను సూచించారు. అత్యవసరమైతే వెంటనే ఆసుపత్రికి తరలించి తలిదండ్రులకు, ఎటిడబ్ల్యు ఓలకు సమాచారం అందించాలని చెప్పారు. విద్యార్థుల తలిదండ్రులకు, గార్డియన్లకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని ఆదేశించారు. గుర్తింపు కార్డు కలిగిన వారితో విద్యార్థులను బయటకు పంపించాలని చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లో విధిగా మూమెంట్ రిజిష్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆదివారం ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు మాత్రమే తలిదండ్రులను, గార్డియన్లను అనుమతించాలన్నారు. అపరిచిత వ్యక్తులతో విద్యార్థులను బయటకు పంపించకూడదన్నారు. పది విద్యార్థుల పెందరోజుల కార్యచరణ ప్రణాళికను, స్టడీ మెటీరియల్ను విడుదల చేసారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల స్టడీ అవర్ నిర్వహించాలని చెప్పారు. వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యా సామర్థ్యాలు మెరుగుపరచాలని పేర్కొన్నారు. పాఠశాలల పరిసరాల్లో గంజాయి వాసన రాకూడదన్నారు. విద్యార్థులు ఎక్కడైనా గంజాయి వినియోగిస్తే తగిన చర్యలు చేపట్టి కౌన్సిలింగ్ ఇప్పించాలని, తలిదండ్రులకు సమాచారం అందించాలని ఆదేశించారు. మార్గదర్శిని కార్యక్రమం అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలనపై కఠిన చర్యలు చేపట్టిందన్నారు. ఈగల్ ఐజి ఇటీవల ఏజెన్సీలో పెదబయలు మండలంలో పర్యటించి ఎనిమిది ఎకరాల్లో గంజాయి తోటలను ధ్వంసం చేసిన విషయాన్ని గుర్తు చేసారు. పాఠశాలలు, మండల స్థాయి, ఐటిడి ఏస్థాయిలో గంజాయి నిర్మూలనపై కమిటీలు ఏర్పాటు చేస్తున్నా మన్నారు. గంజాయి పండించినా తరలించినా, వినియోగించినా వెంటనే 1972 కాల్ సెంటర్కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. గంజాయి వినియోగించే విద్యార్థులు ఉంటే డి ఎడిక్షన్ సెంటర్కి తరలించి కౌన్సిలింగ్ చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్.రజని, డిఇఓ పి.బ్రహ్మాజీరావు, 11 మండలాల ఎటిడబ్ల్యూఓలు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

పంజా విసురుతున్న చలి పులి

- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- శీతల గాలులు, మంచుతో అవస్థలు పడుతున్న మన్య ప్రాంత ప్రజలు
- 10 గంటలైనా వీడని మంచు... దర్శనమివ్వని సూర్య భగవానుడు

విశాలాంధ్ర-చింతపల్లి : మన్య ప్రాంతంలో చలి పులి పంజా విసురుతుంది. శీతల గాలులు దట్టంగా కమ్ముకుంటున్న మంచు కారణంగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉదయం 10 గంటల వరకు వీడని చలి తీవ్రత సాయంత్రం వేలల్లోనూ కొనసాగుతుంది. సాయంత్రం 4 గంటల నుంచే శీతల గాలులు విజృంభిస్తున్నాయి. రాత్రి వేళల్లో చలిపులి మరింత వణికిస్తోంది. మరోవైపు పొగ మంచు కూడా దట్టంగా కురుస్తోంది. ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. నిన్న మొన్నటి వరకు అల్పపీడన ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగినప్పటికీ గడచిన నాలుగైదు రోజులుగా ఉష్ణోగ్రతలు మళ్లీ తగ్గుముఖం పట్టి సింగిల్ డిజిట్ కు చేరుకున్నాయి. స్థానిక వ్యవ సాయ పరిశోధనా స్థానం ఏడీ ఆర్, ఉష్ణోగ్రతల విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పల స్వామి తెలిపిన వివరాల ప్రకారం పాడేరు డివిజన్ పరిధిలో చింతపల్లిలోనే గాక, జీకే వీధి లలో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ఏడీఆర్ తెలిపారు. గడచిన నాలుగైదు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గుతుండడంతో చలి తీవ్రతతో మన్యం వాసులు వణికి పోతున్నారు. ఉన్ని దుస్తులు లేకుండా బయట తిరగలేక పోతున్నారు. సాయంత్రం వేళల్లో చలి మంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు. లైట్లు వేసుకుని వాహనాలను నడపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మరో వైపు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, దైనందిన కార్యక్రమాలు చేసుకునే గృహిణులు, వివిధ వృత్తులకు వెళ్లే ప్రజలు చలి పులి పంజా బారిన పడుతున్నారు. వ్యవసాయ పనులు నిర్వహించుకునే రైతులు, వారపుసంతలకు వెళ్లే గిరిజనులు పొగ మంచు, శీతల గాలుల తీవ్రతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్ని దుస్తులు లేనిదే బయటకు రాలేకపోతున్నారు. మన్య ప్రాంతాన్ని సందర్శించే పర్యాటకులు మాత్రం శీతల వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. చలిని తట్టుకోలేనివారు చలిమంటల వద్ద చేరి సంతృప్తి చెందుతున్నారు. శీతల గాలులు విజృంభిస్తుండడంతో తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. శీతల వాతావరణం కారణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలను తట్టుకునేందుకు ప్రజలు ఉన్ని దుస్తులను ఆశ్రయిస్తుండడంతో ఉన్ని దుస్తులకు గిరాకీ పెరిగింది.

మద్యం సేవించి వాహనాలు నడపరాదు

విశాలాంధ్ర-అరకులోయ : మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని అల్లూరి జిల్లా పాడేరు డీస్పీ కె.ప్రమోద్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక సిఐ హిమగిరి, గోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాడేరు డీస్పీ ముఖ్య అధిదిగా పాల్గొన్నారు. అనంతరం అరకులోయ పరిధిలో ఉన్న ఆటో డ్రైవర్లకు డ్రవింగ్ పై అవగాహన పరిచారు. ఈ సందర్భంగా డీస్పీ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ ట్రాఫిక్ రూల్స్, యూనిఫామ్, ఓవర్ లోడి,ఓవర్ స్పీడ్,డ్రైవింగ్ లైసెన్స్తో పాటు వాహనాల పత్రాలు తప్పని సరిగా ఉండేలా పాటించాలన్నారు. లేనిచో చట్టపరమైన చర్య తీసుకుని కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడప రాదు అన్నారు.మద్యం సేవించి వాహనాలు నడిపితే వారి యొక్క డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రయాణికుల వద్ద అధిక డబ్బులు వసూలు చేసిన తగు చర్య తీసుకోబడతాయని, వాహనాలు నడపటానికి 18 సంవత్సరాలు లోపు పిల్లలు డ్రైవింగ్ చేయకూడదని డ్రైవింగ్ చేసినట్లయితే ఆటో ఇచ్చిన తల్లితండ్రుల మీద మరియు ఆటో యాజమాన్యం మీద క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అరకు పర్యాటక కేంద్రం కావడంతో రానున్న సంక్రాంతి పండగలో హాలిడేస్ కావడంతో అధికంగా పర్యాటకులు వచ్చే అవకాశాలు ఉన్న కారణంగా ప్రజలకు ఎటువంటి ట్రాఫిక్ అంతర్యం కలిగించకుండా చూడాలని ఆటో వాలాలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ లిఎల్.హిమగిరి, అరుకు ఎస్సై జి.గోపాల్,లి పోలీస్ సిబ్బంది, అరకులోయ మండల పరిధిలో ఉన్న ఆటో స్టాండ్ యూనియన్ సభ్యులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కాసాపేటలో పొలం పిలుస్తుంది

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని కాసాపేట గ్రామంలో బుధవారం నాడు మండలవ్యవసాయఅధికారి ఎస్ అవినాష్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంను నిర్వహించారు. అపరాలు మినుము పంటను పరిశీలించి, మినుము పంట శాఖీయదశలో ఉందని, ఈదశలో మొక్కపెగుదల ఎక్కువగా ఉంటుందని తెలియచేశారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు జగదీష్ రైతులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పూర్తిగా చెల్లించండి

తక్షణమే పోలవరం ముంపు లోని రైతుల భూములకు నష్టపరిహారం ఇవ్వండి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం... పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వడంలో పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని మూడు సంవత్సరాల క్రితం కొంతమంది లబ్ధిదారులకి ఇవ్వడం ప్రస్తుతం మూడు సంవత్సరాల తర్వాత కూడా పూర్తిస్థాయిలో ఇవ్వకుండా ఇంకా పెండింగ్ ఉంచటం సరైనది కాదని నిర్వాసితులు ఏమైనా ప్రభుత్వాలను బిచ్చం అడుక్కుంటున్నారా ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మొదటి ముంపు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి పూర్తిస్థాయిలో ఆర్ అండ్ ఆర్ ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం రాజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పెద్దమటపల్లి గ్రామంలో పంకు సత్తిబాబు అధ్యక్షతన జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ నిర్వాసితుల పరిస్థితి ఏమిటో అర్థం కాని స్థితికి పాలకులు తీసుకువెళ్లారని పూర్తి ఆరండార్ ఇవ్వలేదని నిర్వాసితుల భూముల ప్యాకేజీ నేటికీ చెల్లించకుండా కాలయాపన చేయడం భూమికి భూమి ఇవ్వకపోవడం నిర్వాసితులను పట్టించుకోకపోవడమేనని గుర్తు చేశారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మొదటి ముంపు గ్రామాల్లో సర్వే లు ఇంటింటికీ నిర్వహిస్తామని నిర్వాసితుల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తిస్థాయిలో నష్టపరిహారాలు చెల్లించి పునరావాసం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జిల్లా కమిటీ సభ్యులు పులి సంతోష్కుమార్, సోయం చినబాబు మండల నాయకులు కారం సుందరయ్య, తుర్రం బాబురావు, తోడం రాజు, కదల కొండారెడ్డి, కారం సత్తిబాబు, గుండెపుడి లక్ష్మణరావు, కమ్మిచిచ్చు సత్యనారాయణ, జల్లి సత్యనారాయణ, శ్రీరపు తాతబాబు, పొడియం శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో సంక్రాంతి సందడి

విశాలాంధ్ర-వై.రామవరం : మండలంలోని చవిటిదిబ్బలు పంచాయితీ తోటకూర పాలెం కస్తూరి బాయి బాలికల పాఠశాలలో సంక్రాంతి ముందస్తు సంబరాలలో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులు ఉత్సవాలు జరిపారు. ప్రిన్సిపాల్ లక్ష్మి ఆధ్వర్యంలో భోగిమంటలు వేసి, రంగవల్లులు, గొబ్బెమ్మలు పెట్టి విద్యార్థినులు సందడి చేశారు. పిండి వంటలతో ఉత్సవాలను ఘనంగా జరిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు

నిర్లక్ష్యంగా వ్యవహరించిన లోతుగెడ్డ, లంబసింగి కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయండి

పాడేరు డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్ కుమార్

విశాలాంధ్ర-చింతపల్లి : ఈనెల 4వ తేదీ నుండి విధులకు గైర్హాజరు అవుతున్న లోతుగెడ్డ పంచాయతీ కార్యదర్శి సి.హెచ్. రవికుమార్ తో పాటు, పారిశుధ్య నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిన లమ్మసింగి పంచాయతీ కార్యదర్శి పి.అప్పలరాజుకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని పాడేరు డివిజనల్ పంచాయతీ అధికారి పి ఎస్. కుమార్ చింతపల్లి ఎంపీడీవో శ్రీనివాసరావును ఆదేశించారు. వారి సంజాయిషీ సంతృప్తికరంగా లేకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం లోతుగెడ్డ, లమ్మసింగి గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందిని నియంత్రించవలసిన పంచాయతీ కార్యదర్శులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు కార్యాలయ పనివేళలు పాటించాలని,పన్నుల వసూళ్లు, పారిశుధ్యం మెరుగుపరచడం, త్రాగునీటి వనరుల నిర్వహణ పట్ల శ్రద్ధ వహించాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు ఆధారంగా మాత్రమే జీతభత్యాలను చెల్లిస్తామని స్పష్టం చేశారు.

ముగిసిన రెవిన్యూ సదస్సులు

విశాలాంధ్ర-వై.రామవరం : మండలంలో గతనెల 13 నుండి పరంభించిన రెవిన్యూ సదస్సులు బుధవారం తో ముగిసినట్లు తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. బుధవారం యర్రంరెడ్డిపాలెంలో నిర్వహించిన సదస్సులలో పట్టాదారు పాసుపుస్తకాలు, మూటేషన్లు కొరకు దరఖాస్తులు అందయన్నారు.మొత్తం మండలంలో ఇప్పటివరకు 594 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. కార్యక్రమాల్లో వీఆర్వోలు, కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.